

భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - తొండూరు

భ్రూణ హత్యలు చట్టా రీత్యా నేరమని మీడియా అధికారి దేవిరెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో గురువారం లింగ వివక్షత నిర్మూలనపై ప్రిన్సిపల్ ఉషారాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అధికారి మాట్లాడుతూ జిల్లాలో 6 ఏళ్ల వయస్సు పైబడిన ఆడపిల్లల శాతం తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇది సమాజంలో అసమానతలు పెరుగుదలకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. గర్భస్త లింగ నిర్ధారణ చట్టం 994 ప్రకారం జరిమానా విధిస్తారని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి వరకూ పథకాలు తీసుకెళ్లాలి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి వెళ్లి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఎల్‌డిఎంను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జన్ సురక్ష పథకాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఈనెల 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన మరియు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇందుకు తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి, వారిచే బ్యాంకు ఖాతాలను తెరిపించాలని తెలిపారు. కార్యక్రమంను జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా నిర్వహించడంలో సంబంధిత శాఖలైన డిఆర్‌డిఎ, మెప్మా, డ్వామా శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ సమావేశాల నిర్వహణకు సంబంధించిన విషయాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. బ్యాంకులకు సంబంధించిన సమస్యలు ఉన్నవారితో పాటు బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి ఉన్నవారు అందరూ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎల్‌డిఎం జనార్ధన, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు చంద్ర నాయక్, రవి చంద్రబాబు, ఆర్ఎం యూనియన్ బ్యాంక్ లక్ష్మీ తులసి, నాబార్డ్ డిడిఎం విజయ విహారి, ఆర్ఎంఎస్‌బిఐ కృష్ణ కిషోర్, వివిధ బ్యాంకు శాఖల అధికారులు పాల్గొన్నారు. **జిల్లాలో తాగునీటి కొరత రాకూడదు..** జిల్లాలో తాగునీటి కొరత రాకూడదని, తాగునీరు కలుషితం అయిందని ఏ ఒక్క ఫిర్యాదు అందినా సంబందిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా, పరిశుధ్య పనుల పురోగతిపై జెసి అదితిసింగ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కుళాయి కనెక్షన్లను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి వచ్చేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాల అమలు పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా త్రాగునీటి నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్ లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సిపిఒ హాజరతయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఏడుకొండలు, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్‌రైట్స్ సభ్యులు పద్మావతి

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యులు బి.పద్మావతి

ప్రజాశక్తి - కడప

బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో ఎపి స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు బి.పద్మావతి అధ్యక్షతన బాలల హక్కుల పరిరక్షణ, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ విధులను, ఆవశ్యకతను తెలిపారు. బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పిల్లల పట్ల సున్నితత్వంతో మెలిగాలని సూచనలు చేశారు. ప్రధానంగా సంక్షేమ హాస్టల్‌లలో మౌలిక వసతులు మెరుగుపర్చాలన్నారు. సంక్షేమ హాస్టల్‌లలో కంప్లైంట్ బాక్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అన్ని కమిటీలకు రిజిస్టర్స్ నిర్వహణ చేపట్టాలని చెప్పారు. ప్రహరీ క్లబ్స్ (డ్రగ్ అబ్యూస్), ప్రొటెక్షన్, ఎడ్యుకేషన్, పేరెంట్స్, హెల్త్ కమిటీలు పాఠశాలలోనే కాకుండా వెల్ఫేర్ హాస్టల్‌లలో కూడా ఏర్పాటు చేయాలన్నారు. కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తే కమిషన్ తరుపున చర్యలు తీసుకుంటామన్నారు. సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడూ కొత్తగా బాలల కోసం చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయని అన్నారు. పిల్లల సమస్యల కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేసినట్లయితే వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యమంలో సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి, బిసి వెల్ఫేర్ డిడి అంజల, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ హిదియతుల్లా, ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి బాల స్వామి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సహాయ సాంఘిక వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి- కడప : శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జాతీయ లోక్ అదా లత్ నిర్వహింస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పా టు చేశామన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 3, రాయచోటిలో 3, బద్వేల్‌లో 3, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూర్, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మరింత సమాచారానికి 08562 258622, 244622 ఫోన్ నెంబర్లు కానీ, ఈమెయిల్ అడ్రస్: kadapa.dcourts.gov.indlsa kdp @gmail.com, కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు , ఇతర శాఖల అధికారులు జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలన్నారు.

పి4 మోడల్‌తో నియోజకవర్గ అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా పీ4 మోడల్ ద్వారా రాష్ట్రాన్ని భారత దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టేలా ప్రణాళికకు రూపకల్పన చేయనున్నారని, అందులో భాగంగా కడప నియోజకవర్గం అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. శుక్రవారం ద్వారకా నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక తయారు చేశారని, అందులో భాగంగా జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ చైర్మన్‌గా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను నియమించి వారికి స్పెషల్ ఆఫీసర్, సిబ్బందితోపాటు, ఇద్దరు సమాజ సేవలకును సభ్యులుగా చేర్చుకుంటారని తెలిపారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి?, ఆర్థిక ఆదాయం, పరిశ్రమల వివరాలు, వ్యవసాయపరంగా ఉన్న ఆదాయం, సేవా రంగంలో నియోజకవర్గ శాతం తదితర అంశాలతో వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే కడప నియోజకవర్గంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. పర్ క్యాపిటా ఇన్‌కమ్ కడప నియోజకవర్గంలో లక్షా 87 వేలు ఉండగా, పులివెందుల కూడా 3 లక్షలు, కమలాపురం 2.50 లక్షలు, జమ్మలమడుగు 3 లక్షలతోపాటు మిగతా ప్రాంతాల్లో ఇక్కడి కంటే మెరుగ్గా ఉందన్నారు. ఇందుకు ప్రధాన కారణాలు మన ప్రాంతం విస్తీర్ణంలో తక్కువగా ఉండడం, పరిశ్రమలు లేకపోవడం, గత పాలకుల తీరుతో అభివృద్ధి శూన్యం తదితర కారణాలు అనేకం ఉన్నాయన్నారు. రాబోయే కాలంలో మేధావులు, ఇతర అన్ని రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వారితో సమావేశాలు నిర్వహించి కడపను ఎలా ముందుకు తీసుకు వెళ్లాలన్న విషయం చర్చిస్తామన్నారు.

పెన్షన్ అప్డేషన్‌పై ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్‌బిఐ సిబ్బందికి ఇస్తున్నట్టుగానే ఎల్ఐసి పెన్షనర్లకు తక్షణమే పెన్షన్ అప్డేషన్ సౌకర్యాన్ని కల్పిస్తూ ఎల్ఐసి యాజమాన్యం, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పెన్షనర్స్ అసోసియేషన్, కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్ఐసి డివిజన్ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి పెన్షనర్లకు మెడికల్ బెనిఫిట్ ఇవ్వాలని, మెడిక్లెయిమ్ స్కీంలో మెరుగుదల తీసుకురావాలని, పెండింగ్, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సాధారణ బీమా ఉద్యోగులకు ఇంతవరకు 30శాతం ఫ్యామిలీ పెన్షన్, 14శాతం ఎన్‌పిఎస్. అమల్లోకి తీసుకు రాలేదని అన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ స్కీంకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నాయని, అందరికీ పాత పెన్షన్ స్కీంను వర్తింపజేయాలన్న కార్మికులందరి డిమాండ్ విషయంలో కేంద్ర ప్రభుత్వం వైఖరి అభ్యంత రకరమని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాల్ని, పెన్షన్, ఇతర సంక్షేమ చర్యల్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెన్షనర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ధర్నాలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె. శంకర్రావు, టి.చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బరాయుడు, అమర్నాథ్ బాబు, సిసిఎస్ నాయుడు, ఆనందరావు, ఈశ్వర్ రెడ్డి, ఫకీరయ్య, చంద్రాయుడు, అయ్యవారు రెడ్డి పాల్గొన్నారు. **ఉద్యోగుల సంఘం సంఘీభావం..** ఎల్ఐసి పెన్షనర్ల దేశవ్యాప్త ధర్నా కార్యక్రమానికి సంఘీభావంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎం ప్లాయిస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ప్రసంగించారు. యూనియన్ నాయకులు అక్బర్ బాషా, వారిజాతమ్మ, శ్రీవాణి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కోరుతూ కార్మిక సంఘాల కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెకు కెవిపిఎస్ సంపూర్ణమైన మద్దతు తెలియజేస్తున్నట్లు కెవిపిఎస్ నగర కన్వీనర్ దాసరి నరసింహ తెలిపారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వాడితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

సార్వత్రిక సమ్మెలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భాగస్వామ్యం అవుతుందని అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంటా నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిసిసి బ్యాంక్ ఆవరణలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో 4 ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మిక హక్కులను హరిస్తున్నట్లు తెలిపారు. మన హక్కుల సాధన కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉండదని తెలిపారు.

యువతకు ఆదర్శం.. అల్లూరి సీతారామరాజు



అల్లూరి చిత్రపటానికి నవాళి అర్పిస్తున్న ఇన్‌ఛార్జి డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు ఈ తరం యువతకు ఆదర్శనీయమని ఇన్‌ఛార్జి డిఆర్ఒ వెంకటపతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి కార్యక్రమానికి ఇన్‌ఛార్జి డిఆర్ఒ అతిథిగా హాజరై అధికారులతో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వల చసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఆర్ఒ మాట్లాడుతూ నేటి సమాజానికి అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు ఆదర్శణీయం అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని, ఆయన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, అందుకోసం తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడన్నారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే చాలా వన రులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొట్టి వీర మరణం పొందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, బిసి సంక్షేమ శాఖ డిడి అంజన, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పద్మజ, కలెక్టరేట్ ఎఒ విజయ్ కుమార్, టూరిజం మేనేజర్ రామ్ కుమార్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో కడప ఉక్కు కోసం పోరాడుదాం : డివైఎఫ్ఐ

స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత కడప ఉక్కు కోసం పోరాడదామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని కడపలో స్థానిక నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి గడగడలాడించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. స్వతంత్ర పోరాటంలో కీలక భూమిక పోషించి దేశం కోసం వీర మరణం పొందిన గొప్ప వీరుడు అల్లూరి అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో కడప ఉక్కు కోసం యువత పోరుబాట పట్టాలని పిలుపునిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యకులు రెబ్బా.నరసింహులు, నగర కార్యదర్శి విజయ్,యువత పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టు ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ 1897 జూలై 4 న విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంగిలో జన్మించి భారత స్వాతంత్రం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గిపిడుగు అని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.బాల నారాయణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ యు.శ్రీనిత, ఎన్.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ ఎస్. సుగుణ, డాక్టర్ కె.విజయలక్ష్మి, డాక్టర్ రాధిక, జనార్ధన, వాణి, గంగిరెడ్డి, హేమ మహేంద్ర, గౌతమి, సృజన, రమీజా, లిఖిత మస్తాన్‌బీ, ఇతర అధ్యాప కేతర బృందం పాల్గొన్నారు. **వేంపల్లె :** విప్లవ జ్యోతి అయిన అల్లూరి సీతారామరాజు, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చిత్ర పటాళ్లకు పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని, కొణిజేటి రోశయ్య 92 వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ మన్యం ప్రాంతంలో గిరిజనుపై ఆంగ్లేయుల ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, ధన, ప్రాణ దోపిడీకి వ్యతిరేకంగా అల్లూరి సాయుధ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో పులివెందుల నియోజక వర్గం కాంగ్రెస్ సమన్వయ కర్త ధృవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లె, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, బద్రినాథ్, వేమయ్య, సాయి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కడప : భారత స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి, మాజీ ముఖ్యమంత్రి కోనిజేటి రోశయ్య 92వ జయంతిని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, కడపలో శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, పార్టీ నాయకులు అల్లూరి సీతారామరాజు, కొణిజేటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిళ్ళ నరసింహులు, షేక్ నీలం, కమాల్ బాష, మామిళ్ళ బాబు, మయాన రహమతుల్లా ఖాన్, మహమ్మద్ యూసుఫ్, జహూర్ అహ్మద్, నాసిర్ ఖాన్, అబిద్ ఖాన్, హమీద్, షామీర్ హుస్సేన్, బద్రుద్దీన్ ఖాన్ ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహానాయకాల జీవిత స్ఫూర్తిని యువత అనుసరించాలని వారందరూ పిలుపునిచ్చారు.

వల్లూరు : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని శ్రీ యాదాల శేషగిరి మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పాఠశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ భారత స్వాతంత్రం కోసం అహర్నిశలు బ్రిటిష్ వారితో పోరాడి స్వాతంత్ర్య సమరయోధుడిగా అల్లూరి సీతారామరాజు నిలిచాడని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



వల్లూరు : అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు ఆలౌట్

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో మన్విత్‌రెడ్డి సెంచరీ చేయడంతో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 338 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 77.3 ఓవర్లలో 338 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 140 పరుగులు (సెంచరీ) చేశాడు. సయ్యద్ షహుల్ హుస్సేన్ 63 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 3? ధనుష్ రెడ్డి 3, తేజస్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 14 పరుగులు చేసింది.



తలపడుతున్న నెల్లూరు,చిత్తూరు జట్లు

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు, అనంతపురం జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 213 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని విష్ణువర్ధన్ నాయుడు 68, విఖ్యాత 43 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని నవదీప్ 4, సాయి ప్రతాప్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 29.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 139 పరుగులు చేసింది. ఆ జట్టులోని వీరారెడ్డి 62 పరుగులు (నాటౌట్), భార్గవ్ రాజు 39 పరుగులు చేశారు.

యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా


- ప్రతి నెలా వెయ్యి నుంచి 1500 క్వింటాళ్లు సరఫరా
- నాలుగు నియోజకవర్గాల పరిధిలో సేకరణ
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలం నుంచి ప్రతి నెలా రేషన్ బియ్యం యథేచ్ఛగా 1000 నుంచి 1500 క్వింటాళ్ల వరకు అక్రమార్కులు ఎల్లలు దాటిస్తున్నట్లు సమాచారం. మండల పరిధిలోని అంకాలమ్మ గూడూరులో ఓ పొలంలో ఏర్పాటు చేసుకున్న గోడౌన్ నుంచి ప్రతినెలా రేషన్ బియ్యం సేకరించి వాటిని ఇతర రాష్ట్రాలకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఇదే గోడౌన్‌లో సైతం భారీ స్థాయిలో అక్రమ రేషన్ బియ్యం విజిలెన్స్ అండ్ ఇంపోర్ట్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. తిరిగి అదే గోడౌన్ లోనే 215 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శివన్న నేతృత్వంలో ఇటీవల పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో పట్టుబడినప్పటికీ ఏమాత్రం మార్పు లేకుండా తిరిగి అదే గోడౌన్ లోనే బియ్యం నిల్వ చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి పట్ల అధికారుల తీరుపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

నాలుగు నియోజకవర్గాల పరిధి నుంచి సేకరణ...

నాలుగు నియోజకవర్గాల పరిధిలో రేషన్ బియ్యాన్ని కార్డు దారులు, డీలర్ల నుంచి సేకరించి వాటిని ఇతర రాష్ట్రాలకు తరలించి భారీ స్థాయిలో సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. అంకాలమ్మ గూడూరు ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేసుకుని తాడిపత్రి, జమ్మలమడుగు, పులివెందుల, కదిరి నియోజవర్గాల పరిధిలోని మండలాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలుకు ప్రత్యేకంగా టీములు ఏర్పాటు చేసినట్లు సమాచారం. వారి వద్ద నుంచి ప్రధాన నిర్వాహకులు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తుంది.



పట్టుబడిన రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు (ఫైల్)

డీలర్లు సైతం రేషన్ బియ్యం విక్రయాలు...

కొంతమంది రేషన్ డీలర్లు కార్డుదారులకు బియ్యం తూకాలలో తక్కువగా ఇచ్చి మిగిలిన బియ్యాన్ని ఈ నిర్వాహకులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. చాలా రేషన్ దుకాణాలలో బియ్యం తూకంలో మోసాలు జరుగుతున్నాయని కార్డుదారులు వాపోతున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ డబ్బాలలో బియ్యం తూకం వేయడం వల్ల కిలో నుంచి రెండు కిలోలు తక్కువగా వస్తున్నట్లు కార్డుదారులు చెబుతున్నారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు..

మండలంలోని అంకాలమ్మ గూడూరు కేంద్రంగా యథేచ్ఛగా అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రతినెలా రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్న రెవెన్యూ అధికారులకు తెలియదా, తెలిసిన ఏమాత్రం పట్టించుకోలేదా అనే విమర్శలు వినిపిస్తున్నాయి

ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆర్‌టిసి ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతులు వెంటనే ఇవ్వాలని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కడప జోనల్ కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌టిసి కడప డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ కడప డిపో కార్యదర్శి జి.బాల వెంకటేష్ ఆధ్వర్యంలో రాము అధ్యక్షతన ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఉన్న ఖాళీలలో కనీసం పదివేల ఉద్యోగాలకు రిక్రూట్మెంట్ చేపట్టాలని కోరారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తున్న సందర్భంగా మూడువేల కొత్త బస్సులు సొంతంగా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఎపిఎస్ ఆర్‌టిసిలో 62 వేల మంది ఉద్యోగులు ఉండేవారని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైన తరువాత ఆర్‌టిసిలో డైరెక్ట్ రిక్రూట్మెంట్ లేదని చెప్పారు. ప్రస్తుతం 46 వేల మంది మాత్రమే ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా ఎమ్‌డి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్‌టిసి సొంతంగా కొనుగోలు చేసి వాటిని ఆర్‌టిసి డ్రైవర్లతోనే సర్వీసు కొనసాగించాలని డిమాండ్ చేశారు. వాటి నిర్వహణ కోసం ఆర్‌టిసి డిపోలను ఎట్టి పరిస్థితులలో ప్రయివేటు ఆపరేటర్లకు లీజుకు ఇవ్వద్దని పేర్కొన్నారు. పెండింగ్ డిఎలు, 11వ పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని చెప్పారు. నిరసనలో జోనల్ కమిటీ సభ్యులు వి.వి. రెడ్డి, ప్రమీలమ్మ, కడప డిపో వర్కింగ్ సభ్యులు విల్సన్, పీ.వీ.సుబ్బయ్య, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, గ్యారేజీ సెక్రటరీ నరసారెడ్డి, నాయకులు హుస్సేన్ బాష, శ్రీను, గణేష్ సింగ్, చెన్నయ్య, ఎం.వి. సుబ్బయ్య, పెద్ద సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్ కార్యకర్తలు, మహిళలు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పులివెందుల ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. కడప రీజినల్ కార్యదర్శి శ్రీరామమూర్తి, డిపో అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు సంఖ్యలో పాల్గొని సమస్యలు త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతుల్లోనే రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సౌకర్యాలు అందించాలని అవుట్ సోర్స్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు.

రేపటి నుంచి డిఇఇ సెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి -కడప అర్బన్ : జిల్లాలో ఈనెల 6 నుంచి డిఇఇ సెట్ -2025 సంబంధించిన కౌన్సెలింగ్, వెబ్ ఆప్షన్, సీట్ల కేటాయింపు షెడ్యూల్ విడుదల అయిందని డిఇఒ షంషుద్దీన్ ఒక ప్రకటన తెలిపారు. ఈనెల 6, 7 మొదటి కౌన్సెలింగ్, 8 నుంచి 12 వరకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. 13 నుంచి 16 వరకు సీట్ల కేటాయింపు, ప్రొవిషనల్ అడ్మిషన్ లెటర్స్ అందిస్తారని తెలిపారు. 17 నుంచి 22 వరకు డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన, చివరి అడ్మిషన్ లెటర్ ఇస్తారని పేర్కొన్నారు. షెడ్యూల్‌ను విద్యార్థులు అనుసరించాలని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : అక్రమ నిర్మాణాలు, కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కడప నగరానికి సమీపాన, కడప నగరంలో అంతర్భాగమైన మండలంలో భూములు కోట్లాది రూపాయలు విలువ చేస్తుండడంతో కొందరు ఆక్రమించి మొదట రేకుల షెడ్డు వేయడం, తర్వాత భవంతులు నిర్మించడం అలవాటయిపోయిందన్నారు. ఆ తర్వాత వేరే సర్వే నెంబర్ వేసి, దొంగ అగ్రిమెంట్లు రాయించుకొని కోర్టు పోయి స్టే తెచ్చుకోవడంతో అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే చింతకొమ్మదిన్నె గ్రామపంచాయతీలోని హోంగార్డు కాలనీలో సర్వేనెంబర్ 845లో ఉన్నటువంటి రస్తాను అక్రమ అక్రమంగా ఆక్రమించి రేకుల షెడ్డు వేయగా, ఆ విషయం స్థానిక ప్రజలు మండల తన దృష్టికి తెచ్చారని చెప్పారు. వెంటనే జెసిబి సహాయంతో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును పూర్తిగా కూల్చివేశామన్నారు. ప్రభుత్వ భూములు కాని, స్థలాలను ఆక్రమించడం చట్టరీత్య నేరమని, ఎక్కడైనా అక్రమాలకు గురైన, అక్రమ కట్టడాలు కడుతున్న తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలను కోరారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన
- మృతుడి కుటుంబానికి రూ.3 లక్షలు చెల్లించేలా ఒప్పందం
- పెద్ద మనుషుల పంచాయితీతో విరమణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్/తొండూరు

వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. బంధువులు ఆందోళన చేయడంతో ప్రాణానికి రూ. మూడు లక్షలు ఖరీదు కట్టి పెద్ద మనుషులు పంచాయితీ చేశారు. ఈ సంఘటనపులివెందుల చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం సాయంత్రం తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన సండడి లక్ష్మీనారాయణరెడ్డి (53), కిరణ్ కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో పులివెందులకు వస్తుండగా మార్గమధ్యంలో బైకు అదుపుతప్పి ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ ఒడ్డికి తీవ్ర గాయాలు కాగా కిరణ్ కుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మి నారాయణరెడ్డిని పులివెందుల పట్టణంలోని స్థానిక బైపాస్ రోడ్డులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తికి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. చికిత్స కోసం ఆసుపత్రి సిబ్బంది వేల రూపాయలు కట్టించుకొని, పరిస్థితి విషమంగా ఉన్నా పెద్ద ఆస్పత్రులకు పంపించకుండా చికిత్స చేయడం వల్లే లక్ష్మీనారాయణ రెడ్డి మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు. మృతుని బంధువులు ప్రయివేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేయడంతో పెద్దమనుషులు పంచాయితీ చేశారు. మృతుడి బంధువులకు రూ. మూడు లక్షల ఇప్పించి ఆందోళన విరమింప చేసినట్లు తెలుస్తుంది. ఈ సంఘటనపై డాక్టర్ వెంకటేష్ నాయక్‌ను వివరణ కోరగా సరైన వైద్యం చేశామని, ఆసుపత్రికి చేరే సమయానికే పరిస్థితి విషమంగా ఉందని బంధువులకు తెలియజేశామని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ మనిషి ప్రాణానికి విలువ కట్టడంపై పలువురు విమర్శిస్తున్నారు. ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం ఖరీదుతో పాటు ప్రాణాలు పోతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు.


మృతిచెందిన లక్ష్మీనారాయణరెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - వల్లూరు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తప్పెట్ల గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రారంభించిన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ అధికారులచే అక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ఇంత ఆలస్యంగా పథకాలు అందివ్వడానికి కారణం గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేయడమనని వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుబ్బయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదని, రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న అభివృద్ధి సాధకుడు అని కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, భూమయ పల్లె సర్పంచ్ కొంగని వెంకటసుబ్బయ్య యాదవ్, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాములు యాదవ్, మైదుకూరు నియోజకవర్గం, ఖాజీపేట ఐటిడిపి అధ్యక్షుడు తుట్టే రాము యాదవ్, చిత్రాల యేసు పాదంఅన్నారు. శుక్రవారం ఖాజీపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ. ఏడాది పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని అన్నారు. మెగా డిఎస్‌సి, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక, పింఛన్ల పెంపు తదితర ఎన్నో హామీలను నెరవేర్చారని చెప్పారు. ఏడది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు రాష్ట్ర అభివృద్ధికి సహకరించి సూచనలు ఇవ్వాలని, దుష్ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. టిడిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకి తీసుకెళ్ళేందుకు ఐటిడిపి ఎప్పుడు ముందుంటుందన్నారు. **ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) :** సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ 12వ వార్డులో టిడిపి ఇన్‌ఛార్జి అక్బర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైదుకూరు పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కటారి కృష్ణ, పాల మాబు, మారుతీ పాల్గొన్నారు. **వేముల :** మండల కేంద్రంలోని స్థానిక వేల్పుల గ్రామపంచాయతీలో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి నిర్వహించారు. వేల్పులలో గడప గడపకు వెళ్లి ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సంవత్సరకాలంలో చేసిన పనులను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు పేర్ల శేషారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఖాజీపేట : మాట్లాడుతున్న నాయకులు

పంటల బీమా రైతులకు ధీమా

ప్రజాశక్తి - ముద్దనూరు : రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా రైతులకు ధీమా అని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. కె.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి పసల్ భీమా పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో సాగు చేసిన పంటలకు సంబంధించి బీమా చేసేందుకు అనుమతి పొందిన పంటలకు మాత్రమే చెల్లించాలన్నారు. పంటల బీమా పథకాన్ని రెండు కేటగిరీలుగా విభజించినట్లు చెప్పారు. ఇందులో దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత భీమా పథకంగా ఉంటుందని వివరించారు. దిగుబడి ఆధారిత పథకం కింద వరి, జొన్న, మొక్కజొన్న, కంది, ఎండు మిరప, మినుము, పసుపు, ఉల్లి పంటలు కేటాయించినట్లు చెప్పారు. దీనికి ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మీద ప్రీమియం నగదు చెల్లించాలన్నారు. వాతావరణ ఆధారిత పంటల కిందట వేరుశనగ, టమోట, అరటి, ప్రత్తి, నిమ్మ, బత్తాయి పంటలు కేటాయించినట్లు తెలిపారు. వీటికి ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం డబ్బులు చెల్లించాలన్నారు. పంట రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ కేంద్రం, సచివాలయం, ఎన్‌సిఐపి పోర్టల్‌లో బీమా డబ్బులు చెల్లించవచ్చున్నారు. పంట నమోదు ప్రామాణికం ప్రకారం బీమా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంట నమోదు కాకపోతే పసల్ బీమా పథకం వర్తించదని రైతులు గమనించాలని ఎఒ కోరారు. ఈనెల 31లోపు పంట నమోదు బీమా చేసుకోవాలన్నారు. వరి పంటకు ఆగస్ట్ 15 వరకు చివరి అవకాశం ఉందని వ్యవసాయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో రైతులు ప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు టౌన్ గౌరవాధ్యక్షులు జి.ఏసుదాసు. సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్అండ్‌బి అతిథి భవనంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 9న నిర్వహించబోయే అఖిల భారత సమ్మెను జయప్రదం చేసే విధంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తున్నామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్య రాజకీయల కోసం కులాల, మతాల మధ్య చిచ్చు పెట్టడం బిజెపికి ఆనవాయితీగా మారిందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి పార్టీ కార్మికులను అణగదొక్కుతూ, వారి కష్టాన్ని కార్పొరేటు శక్తులకు దోచిపెట్టడం కోసం 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. బ్రిటీష్ కాలాన్ని తలదన్నేలా, దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులను వెట్టి చాకిరి వైపు నెట్టడం దుర్మార్గపు చర్యగా భావిస్తున్నామన్నారు. రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, సంఘాలను. అన్ని రంగాల కార్మిక సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున సమ్మెను జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు అబ్రహం, కార్యదర్శి నరేంద్ర, టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షులు ఆదామ్, కార్యదర్శి ప్రసాదు, కమిటీ సభ్యులు దివాకర్ , కమల్‌బాష, మన్సూర్, స్వామి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందికి వేతనాలను పెంచి ప్రతినెలా ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్మిక చట్టం 1948 ప్రకారం ప్రయివేట్ విద్యాసంస్థల్లోని పాఠశాలలు,కళాశాలలో బోధనేతర గా పని చేస్తున్న వారికి కనీస వేతనం పొందేందుకు అర్హులని తెలిపారు. రాష్ట్రంలో ప్రయివేట్; గ్రాంట్-ఎయిడెడ్ విద్యా సంస్థలలోని బోధనేతర సిబ్బందికి కనీస దినసరి వేతనాన్ని సిఇఐసి డేటా నివేదిస్తుందన్నారు. వారికి నెలకు కనీస వేతనం రూ.15000 ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు ప్రతి నెల వారికి రూ.366 - రూ. 390 లోపు ఇఎస్ఐ, పిఎఫ్ కట్టాలని తెలిపారు. బోధనేతర సిబ్బంది క్లర్క్ ఆఫీస్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ అసిస్టెంట్ , ఆఫీస్ అసిస్టెంట్ క్లర్క్ టైపిస్ట్ అసిస్టెంట్ అకౌంటెంట్ క్యాషియట్ కంప్యూటర్ ఆపరేటర్, వీరందరికీ లేబర్ యాక్ట్ ప్రకారం కనీస వేతనం రూ. 15000 ఇవ్వాలని తెలిపారు. కనీస వేతనం ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరి చేయించుకుంటూ ఉన్నారు. ప్రయివేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న వారందరూ కూడా స్వచ్ఛందంగా 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొనాలని కోరారు.

ఐఐహెచ్‌టిలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - కడప

శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి, తిరుపతి జిల్లాలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు పిచ్చేశ్వ రరావు తెలిపారు. ఈ సంస్థలు హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ వారిచే సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ సంస్థలో దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన శిఅభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తారని తెలి పారు. పదవ తరగతి పాసైన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఇంటర్ ఎంపిసి, ఐటిఐ పాసైన వారు నేరుగా రెండవ సంవత్సరంలో చేరవచ్చునని తెలి పారు. ఈ కోర్సు చదివే వారందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు స్టయిఫండ్ నెలకు రూ. 2500 పొందేందుకు అర్హులని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా అందరికీ ఉద్యోగావకాశాలుంటాయని తెలిపారు.

గండి క్షేత్రం ఆదాయానికి గండి

- రిటైర్డ్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ జి.సి.యోగేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

పుణ్య క్షేత్రమైన గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ అధికారులు ఆలయ ఆదాయానికి గండి కొట్టుతున్నారని రిటైర్డ్ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జి.సి యోగేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయం నూతన నిర్మాణం కారణంగా నాలుగేళ్ల నుంచి బాలాలయం ఏర్పాటు చేసి చెక్క విగ్రహాన్ని పెట్టి పూజలు, పునస్కారాలు చేస్తూ శ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తూ భక్తులకు దర్శనం కల్పిస్తున్నారని చెప్పారు. ఆలయం పనులు దాదాపుగా పూర్తి అయినా దేవదాయ శాఖ అధికారులు కుంబాభిషేకం, పునః ప్రతిష్ట అంటూ కాలయాపన చేయడం చాలా బాధాకరం అన్నారు. ప్రస్తుతం గండి క్షేత్రం ఆలయం సహాయ కమిషనర్ స్థాయిలో ఉందని చెప్పారు. గండి ఆలయ ఆదాయం మరింత పెరిగితే డిప్యూటీ కమిషనర్ స్థాయికి చేరుకుంటుందనే ఉద్దేశంతో పాటు ఆలయంలో పని చేస్తున్న కొందరి ఆటలు సాగవనే ఆలోచనతో ఉద్దేశపూర్వంగా ఆదాయాన్ని గండి కొడుతున్నారని ఆరోపించారు. కుంభాభిషేకం చేయాలంటే రూ. 5 నుంచి .10 కోట్ల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం శోచనీయం అన్నారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తి అవ్వాలంటే ఇంకా మూడు సంవత్సరాలు పడుతుందని అప్పటి వరకు భక్తులకు మూల వర్ల దర్శనం కల్పించే అవకాశం లేదని అధికారులు, అర్చకులు స్పష్టం చెప్పుతున్నారని అన్నారు. ఈ శ్రావణమాసంలోనే భక్తులు మూలవర్లను దర్శనం చేసుకునే భాగ్యాన్ని దేవదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, పాలకమండలి చొరవ తీసుకుంటే బావుంటుందని అభిప్రాయపడ్డారు.


మాట్లాడుతున్న సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్ధయ్య

నీటి నిల్వను నివారించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నీరు మన ఇంటి చుట్టు పరిసరాలలో నిలువ లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ వైద్య అధికారి సిద్దయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని యారగుడిపల్లెలో జాతీయ డెంగ్యూ మసోత్సవం, ఫ్రైడే-డ్రైడే సందర్భంగా దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహనా కల్పిస్తూ నీరు నిలిచిన ప్రదేశంలో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ఆయిల్ బాల్స్ నుంచి ఆయిల్ అనేది విడుదల అయ్యి చమురు నీటి పైన ఒక చిన్న పొర లాగా ఏర్పడి దోమల లార్వాను పుట్టుక దశలోనే నిర్మూలిస్తుందని తెలిపారు. దోమల నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా, చెత్తాచెదారం మురుగు కాల్వలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, శేషా గిరి నాయక్, నాగమణి, సుజాత పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని స్థానిక కొత్తపల్లి సచివాలయంలోని సిబ్బంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం గొందిపల్లి సర్పంచ్ నారాయణమ్మ, కుమారుడు దేవన రామాంజనేయులు వీడ్కోలు సమావేశం నిర్వహించి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించి మన్ననలు పొందానలి పేర్కొన్నారు. శాఖల వావిగా సర్పంచ్ సిబ్బందిని దృశ్యాలువాతో, పూలమాలతో సత్కరిస్తూ స్వీట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.
చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె సచివాలయంలో 5ఏళ్లుగా విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వారికి శుక్రవారం గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మైదుకూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించారన్నారు. విధులలో బాధ్యతగా వ్యవహరించారని ప్రస్తుతం బదిలీ అయిన ప్రాంతాల్లో కూడా ప్రజలకు సేవ చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, విఎఎ, ఎఎన్ఎం లను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జైనుల్లా, లక్ష్మీనారాయణరెడ్డి, రజనీకాంత్ ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

- ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార్‌స్వామి గుప్తా

ప్రజాశక్తి - వేంపల్లె

భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు వెళ్లవద్దని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. శుక్రవారం ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటి క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమార స్వామి గుప్తా మాట్లాడుతూ డ్రగ్స్ అనేవి నిదానంగా ప్రాణాలను హరించే మత్తు పదార్థాలు అన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. [illegible] సూచించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను విద్యార్థులు వమ్ము చేయరాదని చెప్పారు. ఎటువంటి చెడు అలవాట్లకు విద్యార్థులు బానిసలు కాకూడదని చెప్పారు. [illegible] 'సే నో టు డ్రగ్స్ - సే ఎస్ టు లైఫ్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ [illegible], ఎన్ఎస్ఎస్ యూనిట్ 3-14 ప్రోగ్రాం అధికారులు జి. తిరుపతి రెడ్డి, అనిత, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కాశినాయన

బాలాయపల్లె గ్రామానికి చెందిన దళితులు శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని శుక్రవారం తహశీల్దార్ వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం సమర్పించారు అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో దారి ఉండేదని, ప్రస్తుతం కొందరు ఇళ్లు నిర్మించుకోడంతో తాము శ్మశానానికి వెళేందుకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. కొలతలు చూసుకోకుండా ఇళ్లను నిర్మించుకోవడంతో తమకు దారి సమ్య ఏర్పడందని చెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలాన్ని మరమ్మతులు చేసి దారి ఏర్పాటు చేయాలని కోరారు. శ్మశానం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్‌పై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ పై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సమాజ సమస్యలపై అవగాహన కల్పించి, వాటి పరిష్కారానికి ఉపయుక్తమైన మార్గాలను సూచించే విధంగా కార్యక్రమం రూపొందించారన్నారు. కార్యక్రమం ద్వారా యువత తమ వ్యక్తిగత సామర్థ్యాలను గుర్తించడంతోపాటు, అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని జీవితంలో స్థిరత సాధించగలుగుతారన్నారు. ఇతరులకు ఉపాధి కలిగించే సామర్థ్యాన్ని కూడా సాధించవచ్చు అని పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ సి. నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, స్వయం సమర్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చెన్నా రాయుడు , వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు అయ్యవారురెడ్డి, రామేశ్వర్ రెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, డాక్టర్ పి. వి కృష్ణారెడ్డి, శ్రీనివాసులు , విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూటీ డిక్కీలో నుంచి డబ్బులు అపహరణ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో నిలిపి ఉన్న స్కూటీ డిక్కీలో నుండి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులను అపహరణ చేసినట్లు బాధితుడు బి. బాస్కర్ రావు తెలిపారు. వేంపల్లెలోని కుప్పాలపల్లె రహదారిలో ఉన్న ఉర్దూ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న బి. బాస్కర్ రావు అనే వ్యక్తి శుక్రవారం ఎస్‌బిఐ బ్యాంకుకు వెళ్లి రూ 10 వేలు డబ్బులను డ్రా చేసి స్కూటిలోని డిక్కిలో పెట్టారు. అనంతరం బ్యాంకు నుండి పులివెందుల రోడ్డులోని ముత్తుట్ ఫైనాన్స్ కార్యాలయం వద్ద స్కూటీ పెట్టి సూపర్ మార్కెట్‌లోకి వెళ్లారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటి వద్దకు వచ్చి చాకచక్యంగా డిక్కీ బీగాలు తీసి అందులో ఉన్న డబ్బును దొంగలించారు. బాధితుడు సూపర్ మార్కెట్‌లో నుండి బయటికి వచ్చి స్కూటిలోని డిక్కీని తెరచి చూడగా అందులో డబ్బులు లేకపోవడంతో ఆందోళన చెందాడు. డిక్కిలో బ్యాగులో పెట్టిన డబ్బులతో పాటు చెక్కు బుక్స్, ఆఫీసు చెందిన పేపర్లు కూడా చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. పట్టపగలే చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి

అభివృద్ధి ప్రణాళిక సమగ్రంగా తయారు చేయాలి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి

ప్రజాశక్తి పులివెందుల టౌన్

నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమగ్రంగా తయారు చేయాలని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఏర్పాటు గురించి రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని సూచించారు. నియోజకవర్గ స్థాయి ప్రణాళికలో ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ద్వారా ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రస్తుత ప్రతిపాదనలు, నూతన అంచనాలతో నివేదిక తయారు చేయాలని సూచించారు. 2047 వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు కృత నిశ్చయంతో భాగస్వాములు కావాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పది సూత్రాల ప్రణాళిక సమర్థవంతంగా అమలు కావాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీలు బాధ్యతగా పని చేయాలన్నారు. పది సూత్రాల అమలులో భాగంగా ప్రైమరి, ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లలో 15 శాతం పురోగతి సాధించాలన్నారు. పి-4 ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, నియోజకవర్గంలోని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ శాఖల డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా రెడ్డిలక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వేముల



నూతన తహశీల్దార్‌గా టి.రెడ్డిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యో గోన్నతిపై మండలాకి వచ్చారు. గతంలో ఉన్న తహశీల్దార్ ఇందిరా రాణి ఉద్యోగ విరమణ పొందారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులివెందుల మండలం నుంచి రెడ్డి లక్ష్మి వేములకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల వేదికలో రైతులు, ప్రజల నుండి వచ్చే వినతులు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలుత ఈసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిటి జగదీష్ బాబు, ఆర్ఐ ప్రసన్న, విఆర్‌ఒలు, విఆర్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నారాయణ పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాళ్ళపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పిఇటి బుసిరెడ్డి శివానందరెడ్డికి నారాయణ పాఠశాల యాజమాన్యం రూ.50 వేలు ఆర్థిక సాయం చేసింది. వేముల మండలం దుగ్గన్న గారి పల్లెకు చెందిన బుసిరెడ్డి శివానందరెడ్డి అనే వ్యక్తి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న నారాయణ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ కరస్పాండెంట్ కొట్టే నారాయణరెడ్డి శుక్రవారం వైద్య ఖర్చుల కోసం బాధితుడు తల్లి రవణమ్మకు రూ.50 వేలను అందజేశారు. అలాగే పాఠశాలలో పని చేస్తున్న గురు సుబ్బమ్మ అనే ఉపాధ్యాయురాలు రూ 10 వేలు, ఉపాధ్యాయులు అందరూ కలిసి మరో రూ 30 వేలు నగదును అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన బుసిరెడ్డి శివానందరెడ్డి త్వరగా కోలుకోవాలని కరస్పాండెంట్ నారాయణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. గతంలో శివానందరెడ్డి నారాయణ పాఠశాలలో పిఇటిగా పని చేశాడని ఆయన సేవలను గుర్తు తెచ్చుకొని ఆయన కుటుంబానికి ఆర్థిక సహయం చేసినట్లు కరస్పాండెంట్ తెలిపారు. నారాయణ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అందరూ కలిసి మానవత్వంతో గాయపడిన వ్యక్తిని ఆదుకొనేందుకు ముందుకు వచ్చినందుకు వేంపల్లె గ్రామంలోని పలువురు పాఠశాల యాజమాన్యంకు ప్రశంసలు కురిపిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని అన్ని సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఎఇ వీరభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమత్తు వంటి పనులు చేపడుతుండడం వల్ల విద్యుత్ సరఫం ను పట్టణ పరిధిలో ఉదయం 7:30 నుండి 10:30 వరకు మండల పరిధిలో 8 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు సరఫరాలో అంత రాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని తెలిపారు.